క్లుప్తంగా

బస్ షెల్టర్ ప్రారంభం

అమలాపురం టౌన్: స్థానిక సీవీ రామన్ స్కూల్ వ్యవస్థాపకుడు రవణం రాంబాబు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కొంకాపల్లిలో నిర్మించిన బస్ షెల్టర్‌ను లయన్స్ క్లబ్ గవర్నర్ ఈవీవీ ఈశ్వర్ కుమార్ బుధవారం ప్రారంభించారు. దివంగత రాంబాబు విద్యాసంస్థను స్థాపించి ఎందరో విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దారని కొనియాడారు. కార్యక్రమంలో అమలాపురం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రవణం వేణుగోపాలరావు, కార్యదర్శి డాక్టర్ మద్దెల వెంకటేశ్వరరావు, లయన్స్ ప్రతినిధులు జంపన సుమన్‌వర్మ, సుగ్గు గోపాల కృష్ణ, కోకో ఫెడ్ చైర్మన్ అరిగెల బలరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఐక్యతా దివస్ ర్యాలీ

అమలాపురం టౌన్: సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా స్థానిక వెంకటేశ్వర డిగ్రీ కళాశాల విద్యార్థులు బుధవారం ఐక్యతా దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ విద్యార్థుల ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీ అమలాపురం పుర వీధుల్లో సాగింది. కళాశాల ప్రిన్సిపాల్ కె.మనోహర్ విద్యార్థులతో ఐక్యతా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ అండ్ సెక్రటరీ కేవీఆర్ నరసింహారావు, ఏవో కరాటం ప్రవీణ్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద ధర్నా

అమలాపురం రూరల్: ప్రధానమంత్రి భారతీయ జన ఔషధ ప్రయోజన ద్వారా జనరిక్ మందుల షాపులను ప్రజలకు చేరువ చేయాలి, బ్రాండ్ పేరుతో కార్పొరేట్ ఫార్మాస్యూటికల్ కంపెనీలు దోపిడీని అరికట్టాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద రెవల్యూషనరీ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా కాకినాడ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. కోనసీమ జిల్లా పార్టీ కార్యదర్శి ఎం.నాగమణి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి భారతీయ జన ఔషధ ప్రయోజన ద్వారా దేశంలో 12,500 షాపులు అన్ని జిల్లాల్లో ఏర్పాటు చేసినప్పటికీ జనరిక్ మందులు కొనుగోలు చేయడంలో ప్రజలు, వినియోగదారులు పూర్తిస్థాయిలో సఫలం కాలేకపోతున్నారు. జిల్లా పార్టీ కమిటీ సభ్యులు పద్మ, అరుణకుమారి, పార్వతీ, పుష్ప ,అనంతలక్ష్మి, జిత్తుగా అనంత లక్ష్మి, గుణవర్ధన్ అమ్మ పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి



వీరేశ్వరస్వామిని దర్శించుకున్న దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ రమేష్ బాబు

ఐ.పోలవరం: నిత్య కల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయం అభివృద్ధికి కృషి చేస్తానని దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ డీఎల్‌వీ రమేష్ బాబు తెలిపారు. ఆయన బుధవారం స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. తొలుత ఆలయ ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ ఆలయ మర్యాదలతో ఆయనకు ఘన స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం పండితులు ఆయనకు ఆశీర్వచనాలు అంజేశారు. ఆలయ అధికారులు శాలువాతో సత్కరించి ప్రసాదం అందజేశారు. అనంతరం రమేష్ బాబు అన్నదాన మండపాన్ని పరిశీలించారు. కార్తిక మాసం ఏర్పాట్లు, ఆలయ మాస్టర్ ప్లాన్ గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట జిల్లా సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, ఈఈ దుర్గేష్, డీఈఈ శ్రీనివాస్, ఇనస్పెక్టర్ రామలింగేశ్వర రావు ఉన్నారు.

స్కేటింగ్ విజేతకు అభినందన



శ్రీధర్‌ను సత్కరిసున్న కోనసీమ జేఏసీ చైర్మన్ దివాకర్ తదితరులు

అమలాపురం టౌన్: అండర్–14 స్కేటింగ్ పోటీల్లో ఇటీవల రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన అమలాపురానికి చెందిన క్రీడాకారుడు కోటుం కుమార్ చందు శ్రీధర్‌ను కోనసీమ జేఏసీ చైర్మన్, ఉప్పలగుప్తం తహసీల్దార్ వీఎస్ దివాకర్ అభినందించారు. అమలాపురంలో దివాకర్‌ను స్కేటింగ్ విజేత శ్రీధర్‌ను బుధవారం ఘనంగా సత్కరించారు. శ్రీధర్ తండ్రి కేఎస్ మూర్తి ఆర్ అండ్ బీ ఉద్యోగిగానే కాకుండా వాలీబాల్ క్రీడాకారుడిగా తన కుమారుడిని స్కేటింగ్‌లో జాతీయ స్థాయికి తీసుకుని వెళ్లడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వీసీకే పార్టీ జిల్లా అధ్యక్షుడు బొంతు రమణ, మీనా అకాడమి డైరెక్టర్ గెల్లా వెంకటేష్, ఉపాధ్యాయుడు పచ్చిమాల రమేష్‌బాబు పాల్గొన్నారు.

బెల్ట్ షాపుపై దాడి

అమలాపురం టౌన్: అమలాపురం రూరల్ మండలం రోళ్లపాలెంలో అనధికారికంగా బెల్ట్ షాపు నిర్వహిస్తున్న అదే గ్రామానికి చెందిన బంకట రాజును అరెస్ట్ చేసినట్లు బుధవారం ఎక్సైజ్ సీఐ వీటీవీవీ సత్యనారాయణ తెలిపారు. అతని నుంచి రూ.2,100 విలువైన 14 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్‌కేడీవీ ప్రసాద్ ఆదేశాలతో ఎస్సై బాలజీ సిబ్బందితో ఆ బెల్ట్ షాపుపై దాడి చేసినట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు.

కార్తిక సందడికి అభయారణ్యం ముస్తాబు

- ఈ ఏడాది నుంచి వన భోజనాలకు ప్రత్యేక ఏర్పాట్లు
- పర్యాటకులను అలరించనున్న మినీ థియేటర్, అక్వేరియం
- ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకోనున్న స్టాల్స్



అభయారణ్యంలో విశేషాలను తెలియజేసే మినీ థియేటర్



అభయారణ్యంలో ప్రత్యేక ఆకర్షణగా ఏర్పాటు చేసిన అక్వేరియం

తాళ్లరేవు: జిల్లాలో ప్రముఖ పర్యాటక కేంద్రమైన కోరంగి అభయారణ్యం కార్తిక వన మహోత్సవానికి ముస్తాబవుతోంది. ప్రకృతి ఒడిలో చిన్నా, పెద్దా తేడా లేకుండా ఆటపాటలతో సరదాగా గడిపే క్షణాలకు అభయారణ్యం వేదిక కాబోతోంది. సందర్శకులను మరింత ఆకర్షించడంతోపాటు, వినోదాన్ని పంచేవిధంగా అటవీశాఖ మరిన్ని సదుపాయాలను కల్పిస్తోంది. కార్తికమాసం అంటేనే సహపంక్తి భోజనాలు, అందరూ కలిసి సరదాగా గడిపే క్షణాలు. అయితే వన్య ప్రాణుల సంరక్షణ కోసం ఆహార పదార్థాలను ఇప్పటివరకు అభయారణ్యంలోకి అనుమతించేవారు కాదు. సందర్శకులు, పర్యాటకుల కోసం ఈ ఏడాది నుంచి ఉసిరిచెట్టు కింద సహపంక్తి భోజనాలు చేసేవిధంగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏటా జిల్లా నలుమూలల నుంచే కాకుండా వివిధ రాష్ట్రాల నుంచి కూడా పర్యాటకులు ఇక్కడకు వస్తుంటారు. కుటుంబ సభ్యులు, స్నేహితులతో ఉల్లాసంగా గడపడం పర్యాటకులకు మరచిపోలేని అనుభూతినిస్తుంది. సందర్శకుల కోసం తాగునీరు, తినుబండారాలు, శీతల పానీయాల దుకాణాలను కూడా ఏర్పాటు చేశారు.

ప్రత్యేక ఆకర్షణగా అక్వేరియం

అభయారణ్యం ప్రాంతంలో సంచరించే మత్స్య జాతులను పర్యాటకులు వీక్షించే విధంగా నూతనంగా భారీ అక్వేరియం ఏర్పాటు చేశారు. ఇది అభయారణ్యానికే ప్రత్యేక ఆకర్షణ కానుంది. దీంతోపాటు మడ అడవుల ప్రాముఖ్యతను తెలియజేసేవిధంగా డాక్యుమెంటరీని రూపొందించి మినీ థియేటర్‌లో పది నిమిషాలు ప్రదర్శించే విధంగా ఏర్పాట్లు చేశారు. వివిధ రకాల పక్షులను పర్యాటకులు చూసేవిధంగా ప్రత్యేక భారీ పంజరాలను కూడా ఏర్పాటు చేశారు. వివిధ రకాల మొక్కలను కూడా ప్రదర్శించనున్నారు. ఆసక్తిగల వారికి మొక్కలను విక్రయించనున్నట్టు తెలిపారు.

అలరించనున్న బోటు షికార్...క్రీక్ విజిట్‌లు

అభయారణ్యంలో పర్యాటకులకు బోటు షికార్ ప్రత్యేక అనుభూతినిస్తుంది. ఏపీ టూరిజం, అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ బోట్లపై గోదావరి పాయలో ప్రయాణించి సముద్రం కలిసే ప్రాంతానికి తీసుకువెళతారు. అక్కడ నుంచి మడ అడవుల అందాలతోపాటు, కాకినాడ సిటీ అందాలు పర్యాటకులను అలరిస్తాయి. మడ చెట్లపై సంచరించే వివిధ రకాలు పక్షులు, జంతువులు ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకుంటాయి. కేరళ తరహాలో మడ అడవుల్లో ఉండే చిన్నపాటి క్రీక్ (పిల్ల కాలువలు)ల్లో పర్యాటకులు బోట్లపై సందర్శించే విధంగా క్రీక్ విజిట్‌లను కూడా ఏర్పాటు చేస్తున్నారు.



పక్షులు, మొక్కలను వీక్షించేందుకు ఏర్పాటు చేసిన ప్రకృతి స్టాల్



ఉర్రూతలూగించే బోటు షికార్

సందర్శకుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు



అభయారణ్యాన్ని సందర్శించే పర్యాటకులకు మరింత ఆనందాన్ని అందించేందుకు అదనపు సౌకర్యాలు ఏర్పాటు చేశాం. కొన్ని నెలలుగా శ్రమించి ప్రకృతి అందాలతోపాటు ఇక్కడ విశేషాలను అందరికీ తెలిసేవిధంగా మినీ థియేటర్‌ను నిర్మించాం. ప్రకృతి ప్రేమికుల కోసం అక్వేరియం, ప్రకృతి స్టాల్స్ ఏర్పాటు చేశాం. చిన్నారుల ఆటాపాటా కోసం అదనపు సౌకర్యాలు ఏర్పాటు చేసి అభయారణ్యాన్ని మరింత అందంగా తీర్చిదిద్దాం. గోదావరిలో బోటుషికారు సందర్భంగా ఎటువంటి ప్రమాదాలు జరక్కుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశాం. లైఫ్ జాకెట్ వేసుకున్న వారిని మాత్రమే బోటు షికారుకు అనుమతిస్తాం. పోర్టు అధికారుల అనుమతులు, నిబంధనల మేరకు ఒక డ్రైవర్, ఒక సేఫ్టీ గార్డ్ బోటులో ఉండే విధంగా చర్యలు చేపట్టాం. అభయారణ్యం సందర్శనం మరింత అనుభూతినిచ్చేవిధంగా ఏర్పాట్లు చేశాం.

– ఎస్ఎస్ఆర్ వరప్రసాద్, ఫారెస్ట్ రేంజర్, కోరంగి అభయారణ్యం

చేపలు, మాంసం దుకాణాల తొలగింపు

అమలాపురం టౌన్: అమలాపురం నల్ల వంతెన వద్ద ప్రధాన పంట కాల్వ చెంతన చేపలు, మాంసం దుకాణాలను తాత్కాలికంగా ఏర్పాటు చేసుకుని ఇటు ట్రాఫిక్‌కు అటు పంట కాల్వ కలుషితానికి కారణమవుతున్న ఆ దుకాణాలను పారిశుధ్య సిబ్బంది బుధవారం ఉదయం తొలగించారు. నల్లవంతెన నుంచి ఎర్రవంతెనకు వెళ్లే బైపాస్ రోడ్డు మొదట్లో అనధికార దుకాణాల పేరుతో తాత్కాలికంగా గుడిసెలు, పాకలు వేసుకుని చేపలు, మాంసం విక్రయాలు కొనసాగిస్తున్నారు. చేపలు, మాంసం వ్యర్థాలను పంట కాల్వలో పడేస్తూ నీటి కాలుష్యానికి కారణమవుతున్నారు. ప్రధానంగా ట్రాఫిక్ రద్దీగా ఉండే ఈ వంతెనపై ఈ తాత్కాలిక దుకాణాల వల్ల అవరోధమవుతోంది. ప్రజల నుంచి తాత్కాలిక చేపలు, మాంసం దుకాణాలపై ప్రజల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తడంతో మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు ఆదేశాలతో మున్సిపాలిటీ పారిశుధ్య విభాగం ఆధ్వర్యంలో సిబ్బంది వాటిని తొలగించే చర్యలు చేపట్టారు. నల్లవంతెన వద్ద చేపలు, మాంసం అనధికార అమ్మకాలకు తెరపడడంతో పాటు తాత్కాలిక దుకాణాలకు కూడా తొలగించడంతో ఆ ప్రాంతం ట్రాఫిక్‌కు విశాలంగా మారింది. గత కమిషనర్ ఇలానే గతంలో ఓసారి దుకాణాలు తొలగించినా కొన్నాళ్లకు పరిస్థితి యథాతథం అయింది. ఈసారి అలా కాకుండా గట్టి చర్యలు తీసుకున్నారు. మళ్లీ ఇదే స్థలంలో చేపలు, మాంసం దుకాణాలను ఏర్పాటు చేస్తే ఈసారి చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని కమిషనర్ రాజు స్పష్టం చేశారు. మున్సిపల్ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ఎల్ నాగేంద్ర ప్రసాద్, శానిటేషన్ అండ్ ఎన్విరాల్‌మెంట్ సెక్రటరీ బండి వీరన్న, ప్లానింగ్ సెక్రటరీ బీఎం రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నడుమ దుకాణాలను తొలగించారు.



అమలాపురం నల్లవంతెన వద్ద వెలిసిన తాత్కాలిక చేపలు, మాంసం దుకాణాల తొలగింపు అనంతరం విశాలంగా కనిపిస్తున్న రోడ్డు

బాణసంచా దుకాణాల్లో సందడి

అమలాపురం రూరల్: దీపావళి పండగకు పది రోజుల ముందు నుంచే ఇంటింటా టపాసుల తయారీ సందడి ఉండేది. నేటి యాంత్రిక జీవనంలో అలాంటివి క్రమేపీ దూరమయ్యాయి. దీపావళి ముందు రోజు, పండగ నాడు ఏర్పాటయ్యే బాణసంచా దుకాణాలు టపాసులు కొనుగోళ్ల హడావుడి మాత్రమే కనిపిస్తోంది. దీపావళి సందర్భంగా అమలాపురం పట్టణ, రూరల్ పరిధిలో బుధవారం అమలాపురం జనుపల్లిలోని బాలయోగి స్టేడియంలో అధికారులు అనుమతిచ్చిన 53 దుకాణాలు ఏర్పాటయ్యాయి. అలాగే బండార్లంక, కామనగరువు, సమనస, పేరూరు తదితర ప్రాంతాల్లో 15 దుకాణలతో కలిపి మొత్తం 68 షాపులు వెలిశాయి. వినియోగదారులతో దుకాణాల వద్ద రద్దీ ఏర్పడింది. అమలాపురం తహసీల్దార్ సునీల్‌కుమార్, తాలూకా ఎస్సై శేఖర్ బాబు, అగ్నిమాపక అధికారి మురళీ కొండబాబు దుకాణాల ఏర్పాట్లను పర్యవేక్షించారు. ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ అమ్మకాలు చేయాలని తహసీల్దార్ కోరారు.

30 శాతం పెరిగిన ధరలు

గత ఏడాది కంటే అన్ని రకాల టపాసులపై 30 శాతం ధరలు పెరిగాయి. జీఎస్టీ విధించడంతో ధరలు మరింతగా పెరిగాయి. గత ఏడాది కాకర పువ్వొత్తుల కట్ట (పెద్దది) రూ.180 ఉంటే, ఇప్పుడది రూ.200 పెరిగింది. చిన్న కాకర పువ్వొత్తుల కట్ట రూ.40 ఉంటే, ప్రస్తుతం రూ.60కు పెరిగింది అగ్గిపెట్ల కట్ట రూ.25 పలుకుతోంది. షాట్లు 25 రకం రూ.450కి పెరిగింది. వెయ్యి సీమ టపాసుల బాక్స్ రూ.450 పెరిగింది. వంద తాటాకు టపాకాయల ధర గతంలో రూ.80 ఉంటే, ఇప్పుడు రూ.120 పలుకుతోంది. ధరలు అధికంగా ఉన్నా, వినియోగదారులు కొనుగోళ్లు చేస్తున్నారు. తొలిరోజు అమ్మకాలు మందకొడిగా ఉన్నాయని వ్యాపారులు చెబుతున్నారు.



అమలాపురంలోని బాలయోగి స్టేడియంలో బాణసంచా దుకాణాల వద్ద సందడి

మున్సిపల్ షాపుల అద్దెలు తగ్గించాలి

అమలాపురం టౌన్: స్థానిక పొట్టి శ్రీరాములు మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ (సర్క్యులర్ బజార్)లోని షాపులను లీజుకు తీసుకున్న వ్యాపారులు అద్దె తగ్గించాలని కోరుతూ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావుకు బుధవారం వినతిపత్రం అందించారు. మున్సిపాలిటీ షాపులకు అద్దెలు పెంచుతూ తమకు నోటీసులు ఇచ్చిందని వివరించారు. తమ ఆర్థిక పరిస్థితి దృష్ట్యా భారం కాకుండా పాత పద్ధతిలోనే అద్దెలు కొనసాగించాలని ఎమ్మెల్యేకు లీజుదారులు విజ్ఞప్తి చేశారు. కరోనా సమయంలో దాదాపు ఆరు నెలల పాటు దుకాణాలు తెరవకపోయినప్పటికీ, వ్యాపారాలు సాగనప్పటికీ మున్సిపాలిటీకి అద్దె బకాయిలను వడ్డీతో సహా చెల్లించామని వారు గుర్తు చేశారు. సర్క్యులర్ బజార్ వర్తక సంఘం అధ్యక్షుడు జనిపిరెడ్డి సురేష్, సంఘం గౌరవాధ్యక్షుడు అల్లాడ వెంకటరమణ, కార్యదర్శి మలకా రాజేష్, కోశాధికారి తాడి రవి, ఉపాధ్యక్షుడు కాండ్రేగుల గోపి, ఆర్డీఎస్ ప్రసాద్, అరిగెల నాగబాబు తదితరులు ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇచ్చిన వారిలో ఉన్నారు.



ఎమ్మెల్యే ఆనందరావుకు వినతిపత్రం అందిస్తున్న మున్సిపల్ సర్క్యులర్ బజార్ వ్యాపారులు

సేవలు అభినందనీయం

అమలాపురం టౌన్: అమలాపురం టెలికం కార్యాలయంలో టెక్నీషియన్‌గా జిన్నూరి వాణేశ్వర రావు (వాణి) అందించిన సేవలు అభినందనీయమని బీఎస్ఎన్ఎల్ డీఈ పీఎస్ఎల్ నరసింహారావు అన్నారు. వాణి ఉద్యోగ విరమణ సందర్భంగా స్థానిక దుడ్డివారి అగ్రహారంలోని టెలికం కార్యాలయంలో ఆయనకు బీఎస్ఎన్ఎల్ అధికారులు, ఉద్యోగులు బుధవారం రాత్రి ఘనంగా వీడ్కోలు పలికారు. డీఈ నరసింహారావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. బీఎస్ఎన్ఎల్ ఎస్‌డీఈలు వై.వెంకటేశ్వరరావు, కేవీఎస్ ప్రసాద్, జేటీవోలు పి.శ్రీనివాసరావు, కె.రాజేంద్రతోపాటు వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, పార్టీ జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు జిన్నూరి వెంకటేశ్వరరావులు ప్రసంగిస్తూ వాణి సేవలను కొనియాడారు. అనంతరం వాణి, జయ దంపతులను సత్కరించారు. విజయవాడ ఎస్‌డీఈ సిబ్బంది, టెక్నీషియన్లు, విశ్రాంత బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు పాల్గొన్నారు.



టెలికం టెక్నీషియన్ వాణి దంపతులను సత్కరిస్తున్న బీఎస్ఎన్ఎల్ అధికారులు, ఇంజినీర్లు

పీడబ్ల్యూడీ సిబ్బందికి రూ.18 వేల వేతనం

యానాం: యానాం రీజియన్‌తో పాటు పుదుచ్చేరి, మాహే, కారైకల్‌లో ఓచర్ పెయిడ్ ఉద్యోగులుగా గత కొన్నేళ్ల నుంచి పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ (పీడబ్ల్యూడీ) శాఖలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి నవంబర్ నుంచి రూ.18 వేలు జీతం అమలు చేస్తున్నట్లు బుధవారం ముఖ్యమంత్రి కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. నెలకు రూ.10 వేలు ఉన్న జీతాన్ని రూ.18 వేలు చేస్తామని రెండేళ్ల క్రితం అసెంబ్లీలో సీఎం రంగసామి హామీ ఇచ్చారు. ఈ హామీ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నాలుగు రీజియన్లలో ఉద్యోగులు ధర్నాలు, నిరాహార దీక్షలు చేస్తూ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో సమస్య తీవ్రతను సీఎం రంగసామి ఎల్జీ కె.కైలాష్‌నాథ్ దృష్టికి తీసుకువెళ్లడంతో ప్రభుత్వం పంపిన ఫైల్‌కు ఆయన ఆమోదం తెలిపారు. జీతాల పెంపుతో పుదుచ్చేరి వ్యాప్తంగా మొత్తం 1,378 మంది ఉద్యోగులు లబ్ధి పొందనున్నారు. ఓచర్‌పెయిడ్ సిబ్బంది సమస్యను తాను సైతం అసెంబ్లీ సమావేశాల్లో లేవనెత్తి సమస్య పరిష్కారానికి తన వంతు కృషి చేసినట్లు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ తెలిపారు.

జూనియర్ ఇంజినీర్ పరీక్ష ఫలితాల విడుదల

యానాం: యానాంతో పాటు మూడు రీజియన్లలో పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్‌లో ఖాళీగా ఉన్న సివిల్ జూనియర్ ఇంజినీర్ (సివిల్) ఇంజనీరు పోస్టులకు ఈ నెల 27న నిర్వహించిన పోటీ పరీక్ష ఫలితాలను డిపార్ట్‌మెంటల్ ఆఫ్ పర్సనల్ అండ్ అడ్మినిస్ట్రేటివ్ రిఫామ్ వింగ్ విడుదల చేసింది. వివిధ కేటగిరీల్లో కనీస అర్హత మార్కులు సాధించి 26 మంది ఎంపికైనట్టు తెలిపారు. ఎంపికైన వారి ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలన తేదీలను త్వరలో ప్రకటిస్తారన్నారు. పీడబ్ల్యూడీ శాఖలో జూనియర్ ఇంజనీరు (సివిల్) పోస్టులు 99 ఖాళీలు ఉన్నప్పటికీ పోటీ పరీక్షలో 26 మంది మాత్రమే కనీస అర్హత మార్కులు సాధించారు. పేపర్–1 98 మార్కులకు, పేపర్–2 96 మార్కులకు వెరసి మొత్తం 194 మార్కులకు పరీక్ష నిర్వహించారు. జనరల్ అభ్యర్థులకు 58.20 మార్కులు (30 శాతం), ఎంబీసీ, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్, ఈబీసీ, బీసీఎం అభ్యర్థులకు 48.50 మార్కులు (25 శాతం), ఎస్సీ, ఎస్టీలకు 38.80 (20 శాతం) మార్కులు కనీస అర్హతగా మార్కులుగా నిర్ణయించారు. కాగా యానాం నుంచి ఓబీసీ విభాగం నుంచి ఎం మణికంఠ శ్రీనివాస్ ఎంపికయ్యారు.

ధాన్యం కొనుగోలు సిబ్బందికి శిక్షణ

ముమ్మిడివరం: స్థానిక ఎయిమ్స్ కళాశాలలో కొత్తపేట డివిజన్ పరిధిలోని ధాన్యం కొనుగోలు సిబ్బందికి బుధవారం శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణలో రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ డైరెక్టర్ మోకా ఆనందసాగర్ మాట్లాడారు. రైతులు దళారుల చేతిలో మోసపోకుండా ప్రభుత్వం కల్పించే గిట్టుబాటు ధరలను వారికి వివరించాలని సూచించారు. కార్యక్రమంలో పౌర సరఫరాలశాఖ జిల్లా మేనేజర్ ఎం.బాల సరస్వతి, జిల్లా వ్యవసాయాధికారి వి. బోసుబాబు, జిల్లా సహాయ మేనేజర్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

ఐ.పోలవరం: ఎన్నికల్లో ఉపాధ్యాయ సంఘాలకు ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగులందరికీ క్రిస్మస్, సంక్రాంతి కానుకగా ఐఆర్‌ను విడుదల చేయాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) డిమాండ్ చేసింది. ఎస్టీయూ మండల సమావేశం మురమళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం మండల శాఖ అధ్యక్షులు ఆకెళ్ల సూర్యమోహన్ అధ్యక్షతన జరిగింది. పలు ఉపాధ్యాయుల సమస్యలపై చర్చించారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి వెన్నా వీర వెంకట సుబ్రహ్మణ్యం, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి నిమ్మన సత్యనారాయణ, మండల ఆర్థిక కార్యదర్శి జొన్నాడ రవి కిరణ్, డి.నారాయణరావు, గుత్తుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

ముమ్మిడివరం: ప్రతిఒక్కరూ చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని జిల్లా మానసిక వైద్యురాలు డాక్టర్ సౌమ్య సూచించారు. బుధవారం ముమ్మిడివరం ఎయిమ్స్‌లో మానసిక ఆరోగ్యంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకూ అందరూ సెల్‌ఫోన్లకు బానిసలుగా మారుతున్నారన్నారు. మత్తు పదార్థాలకు సైతం దగ్గరవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చెడు అలవాట్లు మానసిక ఆందోళనకు దారితీస్తాయని, వాటికి దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓట్లు నమోదు చేయించాలి

తాళ్లరేవు: ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల నుంచి పట్టభద్రుల ఓటర్లను అత్యధిక స్థాయిలో నమోదు చేయించి పట్టభద్రులు కూటమి అభ్యర్థిగా పోటీచేయనున్న పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించడానికి కృషి చేయాలని ఎన్నికల పరిశీలకుడు, ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి రావు కోరారు. బుధవారం పి మల్లవరంలో డీజీబీ కల్యాణ మంటపంలో ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీపీ రాయుడు సునీత, నాయకులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం

అమలాపురం రూరల్: ఈదరపల్లి గ్రామంలోని హరి మనో వికాస కేంద్రంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రాష్ట్ర లీగల్ సర్వీసెస్, మండల లీగల్ సర్వీస్ ఫొరా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అమలాపురం ఏరియా హాస్పిటల్ మెడికల్ ఆఫీసర్ పి.గీతిక పర్యవేక్షణలో డాక్టర్ బి.స్వర్ణకళ, డాక్టర్ వీఎస్ పద్మారాణి, డెంటిస్ట్ ఎల్.దేవకుమార్, ఆప్తమాలజిస్ట్, సీహెచ్ మీనాక్షి, ఫిజియోథెరపిస్టు, ఎం.నీలిమ, ఆడియాలజిస్ట్, ఎల్‌వీఎస్ ప్రవల్లిక 50 మంది దివ్యాంగ పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో హరి మనోవికాస కేంద్రం డైరెక్టర్ ఎస్. రాజశేఖర్, ఆనంద్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

ముమ్మిడివరం: యానాం నుంచి మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇనస్పెక్టర్ ఎల్.చిరంజీవి బుధవారం తెలిపారు. మొగల్తూరు గ్రామానికి చెందిన రావుల నర్సింహమూర్తి యానాంలో నుంచి మద్యం కొనుగోలు చేసి తీసుకు వస్తుండగా ఎదుర్లంక బ్రిడ్జి వద్ద ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ సిబ్బంది తనిఖీ చేసి పట్టుకున్నారన్నారు. అలాగే ఎస్టీఎఫ్ అమలాపురం సిబ్బంది కొత్తపేట స్టేషన్ పరిధిలో సారా స్థావరాలపై దాడి చేసి 2100 బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు చెప్పారు.

యానాం మద్యం పట్టివేత

ఐ.పోలవరం: పుదిచ్చేరి యానాం నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని ముమ్మిడివరం ఎక్సైజ్ పోలీసులు బుధవారం పట్టుకున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరుకు చెందిన రావుల నరసింహమూర్తి యానాం నుంచి ఐదు మద్యం సీసాలను తరలిస్తుండగా ఎదుర్లంక వద్ద పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్లు సీఐ ఎల్.చిరంజీవి తెలిపారు.

అక్షయ పాత్రకు 22 కిలోల మహా 'కంద' అందజేత



అక్షయ పాత్ర ప్రతినిధులకు 22 కిలోల మహా కందను అందజేస్తున్న దాత వెంకట సాయిరామ్

అమలాపురం టౌన్: దీపావళి అమావాస్య సందర్భంగా అమలాపురం విద్యుత్‌నగర్‌లోని శ్రీ గౌతమ మహర్షి అక్షయ పాత్ర సంస్థకు 22 కిలోల మహా కందను ఆ సంస్థ సభ్యుడు సలాది వెంకట సాయిరామ్ బుధవారం అందించారు. గురువారం రాత్రి 8 గంటలకు విద్యుత్‌నగర్‌లోని అక్షయ పాత్ర కేంద్రమైన శ్రీ ఆదిశేష నిలయంలో కంద దీపాన్ని వెలిగించనున్నట్టు ఆ సంస్థ వ్యవస్థాపకురాలు పోతురాజు నాగ కనకదుర్గ తెలిపారు. ఈ దీపం కార్తిక మాసమంతా అఖండంగా వెలుగుతుందని చెప్పారు. వెంకట సాయిరామ్ అక్షయ పాత్రకు కందనే కాకుండా రూ.16 వేలు విరాళంగా అందించారు. శ్రీ ఆదిశేష నిలయంలో ద్వాదశి రాత్రి నవ దుర్గా అఖండ హోమం,పూజా మహోత్సవానికి రాజమహేంద్రవరానికి చెందిన వేము సుబ్బారాయశర్మ, శారద దంపతులు రూ.10 వేలు, ఉప్పలగుప్తం మండలం నంగవరానికి చెందిన సలాది దొరయ్యనాయుడు, అన్నపూర్ణ దంపతులు రూ.18 వేలు విరాళాలుగా అందించారు.

నిత్యాన్నదానానికి విరాళం



వీరేశ్వరస్వామి ఆలయంలో లక్షపత్రి పూజ

ఐ.పోలవరం: మండలంలోని మురమళ్ల వీరేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించే నిత్యాన్నదాన ట్రస్ట్‌కు బుధవారం ఓ భక్తుడు విరాళం అందించారు. మండపేట గ్రామానికి చెందిన పడాల నవ్యంత రెడ్డి రూ.10,116 విరాళం ఆలయ సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా దాతను కార్యనిర్వాహణాధికారి మాచిరాజు లక్ష్మీ నారాయణ అభినందించారు. దాతకు అర్చకులు బ్రహ్మశ్రీ స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి శేష వస్త్రం, స్వామివారి చిత్ర పటం, ప్రసాదం అందజేశారు.

ఘనంగా లక్షపత్రి పూజ

మండలంలోని మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో బుధవారం లక్షపత్రి పూజ ఘనంగా నిర్వహించారు. మాస శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని అర్చకులు బ్రహ్మశ్రీ యనమండ్ర సుబ్బారావు, బ్రహ్మశ్రీ నాగాభట్ల రామకృష్ణ మూర్తి ఆధ్వర్యంలో స్వామివారికి లక్షపత్రి పూజ, అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రేషన్ షాపుల ద్వారా సరకుల పంపిణీపై సూచనలు

యానాం: యానాంతో పాటు మిగిలిన మూడు రీజియన్లలో నిత్యావసర వస్తువులను రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేయాలనే ప్రతిపాదనకు సంబంధించి బుధవారం కేంద్రం పుదుచ్చేరి ప్రభుత్వానికి పలు సూచనలు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) విధానంలో రేషన్ అందిస్తున్నారు. రేషన్ షాపుల ద్వారా సరకుల పంపిణీకి పుదుచ్చేరి ప్రభుత్వం ఏదైనా ప్రోగ్రామ్ ఇంప్లిమెంట్ ఏజెన్సీని ఏర్పాటు చేసుకోవాలని, అది పారదర్శకంగా ఉండాలని సూచించింది. ఆహారధాన్యాల పంపిణీలో ఎలాంటి దోపిడీ లేకుండా నాణ్యతను ధ్రువీకరించడానికి ప్రభుత్వం బలమైన వ్యవస్థను నెలకొల్పాలని కోరింది.

గ్యాస్ సమస్య పరిష్కారానికి చర్యలు



ఎల్జీ కైలాష్‌నాథన్‌ను సత్కరిస్తున్న డాక్టర్ నాయుడు

యానాం: పట్టణంలో రీజెన్సీ సిరామిక్స్ టైల్స్ భారీ పరిశ్రమ తిరిగి పునఃప్రారంభమయ్యే దశలో సహజ వాయువు సమస్యను పరిష్కరించడానికి ప్రభుత్వపరంగా చర్యలు తీసుకుంటానని ఎల్జీ కె.కైలాష్‌నాథ్ హామీ ఇచ్చారని రీజెన్సీ సంస్థల చైర్మన్ డాక్టర్ జీఎన్ నాయుడు తెలిపారు. బుధవారం పుదుచ్చేరి రాజ్‌నివాస్‌లో ఎల్జీ కైలాష్‌నాథ్‌తో సమావేశమై 12 ఏళ్ల నుంచి రీజెన్సీ టైల్స్ పరిశ్రమ వివిధ కారణాలతో మూతపడిందన్నారు. కార్మికులు, యానాం నియోజకవర్గ నిరుద్యోగ యువతకు ఉపాధి తదితర కారణాల రీత్యా పరిశ్రమను పునఃప్రారంభానికి ఇప్పటికే రూ.కోట్లలో పెట్టుబడి పెట్టినట్టు తెలిపారు. గ్యాస్ సరఫరా సమస్యను పరిష్కరించడానికి అత్యున్నతస్థాయి సమావేశాన్ని ఏర్పాటుచేస్తానని ఎల్జీ హామీ ఇచ్చారని నాయుడు తెలిపారు. సమావేశంలో రీజెన్సీ సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ నరాల సత్యేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక లారీల సీజ్

ఐ.పోలవరం: నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలిస్తున్న లారీలను పోలీసులు సీజ్ చేశారు. ఐ.పోలవరం మండలంలో గుత్తెన దీవి, ఎదుర్లంక రేవుల నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న లారీలను మంగళవారం రాత్రి పోలీసులు సీజ్ చేశారు. ఈ మేరకు ఎస్సై మల్లికార్జునరెడ్డి సీజ్ చేసిన లారీలను తహసీల్దార్ కోర్టులో హాజరుపరిచారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు లేని ర్యాంపుల నుంచి ఇసుకను రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.